రక్షణ చర్యలు పటిష్టంగా ఉండాలి



కోల్‌కత్తాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం హేయమైన చర్య. విధుల్లో ఉన్న మహిళా వైద్య సిబ్బందికి రక్షణ అవసరం. ఏ డ్యూటీ వేసినా రక్షణ చర్యలు పటిష్టంగా ఉండాలి. హత్యాచారం దోషులకు తగిన శిక్ష విధించాలి. కోల్‌కత్తా లాంటి ఘటనలు మరెక్కడా జరగకుండా ఆసుపత్రి వ్యవస్థలో కూడా మార్పు రావాలి. వైద్యుల సేవలను గుర్తించి వారిని స్వేచ్ఛగా పని చేసుకునే వాతావరణం కల్పించాలి.

– భారతి, ఏఎన్‌ఎం, కాట్నగల్లు , పెద్దతిప్పసముద్రం

దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి



కలకత్తా డాక్టర్ ఘటన దేశాన్ని కలవరపరచింది. హత్యాచార సంఘటన ఇప్పటికీ ప్రకంపనలు సృష్టిస్తోంది. వైద్యులపైనే అఘాయిత్యాలకు పాల్పడితే ప్రజారోగ్యం కాపాడేది ఎలా..? చనిపోయే ముందు ఆమె ఎంత బాధ, వేదన, క్షోభను అనుభవించిందో. తలచుకుంటేనే కన్నీళ్లు తెప్పిస్తోంది. ఈకేసులో దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి.

– క్రిస్టల్, మండల వైద్యాధికారి, కురబలకోట



దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలి



దేశంలో ఏదైనా ఘటన జరిగినప్పుడు కొంత హడావుడి చేసి కొన్ని చర్యలు తీసుకుంటారు. ఆ తరువాత వాటిని వదిలేయడం వల్లనే కోల్‌కత్తా లాంటి ఘటనలు పునరావృతమతున్నాయి. ప్రణాళిక బద్ధమైన చర్యలు తీసుకోవాలి. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే మరిన్ని దారుణమైన సంఘటనలు జరుగుతాయి. దాడి చేస్తే కఠిన శిక్షల అమలు త్వరితగతిన జరిగేలా చూడాలి.

– డాక్టర్ శంకర్, కందుకూరు పీహెచ్‌సీ, పెద్దతిప్పసముద్రం

డాక్టర్లకు రక్షణ కల్పించాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు వైద్యసేవలు అందించే డాక్టర్లకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలి. ముఖ్యంగా మహిళా డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. సమాజంలో ప్రాణదాతలుగా పేరుపొందిన డాక్టర్ల పట్ల అమానుషంగా వ్యవహరించిన దుండగులను కఠినంగా శిక్షించాలి. కలకత్తా సంఘటన మహిళా డాక్టర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా మారిందన్నారు. పట్టణాలకు దూరంగా ఉన్న ఆస్పత్రుల్లో మరింత కట్టుదిట్టంగా రక్షణ కల్పించాలి.

– రవీంద్రనాయక్, మండల వైద్యాధికారి, గుర్రంకొండ

క్లుప్తంగా

భక్తులకు అన్నదానం

పెద్దతిప్పసముద్రం : శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా స్థానిక చిన్న అంజనేయస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆంజనేయ స్వామి భక్తులు వందలాది మందికి అన్నదానం చేశారు.

మండల సమావేశం వాయిదా

కలికిరి : మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సిన సాధారణ మండల సర్వసభ్య సమావేశానికి ప్రాదేశిక సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా వేశామని, తదుపరి సమావేశం ఎంపీపీని సంప్రదించి నిర్ణయించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మూడవ శనివారం కావడంతో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు తగిన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. శనివారం చిత్తూరు రోడ్డులోని ఇంజినీరింగ్ కాలేజీలో ఐబిఎం స్కిల్ బిల్డ్ క్యాంపు శిక్షణ తరగతులు నిర్వహించారు. నైపుణ్యాలు మెరుగుపడితే ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. ఈ శిక్షణ స్కిల్స్ పెంపొందించడానికి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, సమన్వయ కర్తలు షఫీ, గంగాధర్‌రెడ్డి ,ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

తంబళ్లపల్లె : గ్రామ పంచాయతీలకు సంబంధించిన రికార్డులు పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా నిర్వహించాలని సీనియర్ ఆడిటర్ రుద్రవెంకటసాయి సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీలకు సంబంధించిన జమా,ఖర్చులపై ఆడిట్ నిర్వహించారు. గోపిదిన్నె, పంచాలమర్రి, కోసువారిపల్లె పంచాయతీల రికార్డుల నిర్వహణ, ఖర్చులపై ఆడిట్ పూర్తి చేశారు. మిగిలిన పంచాయతీల కార్యదర్శులు కూడా వారి పంచాయతీలకు సంబంధించిన ఆడిట్‌ను త్వరగా నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రఘు, నరసింహులు తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మదనపల్లె : తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద తెలిపారు. వైద్యశిబిరానికి హాజరయ్యే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం మండలంలోని తవళం పంచాయతీ కుమ్మరపల్లె సమీపంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. స్థానికంగా నివాసం ఉన్న ఒలిపి శాంతమ్మ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె వద్ద నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

అలరించిన భగవద్గీత పారాయణం

మదనపల్లె సిటీ : శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని స్థానిక అనపగుట్టలోని గోవర్ధనగిరి శ్రీకృష్ణ ఆలయంలో శనివారం శివానంద భక్తి మండలి ఆధ్వర్యంలో చిన్నారులచే భగవద్గీత పారాయణం అలరించింది.18 శ్లోకాలు పారాయణ చేశారు. పారాయణం చేసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శివానందభక్తి మండలి నిర్వాహకులు గణేష్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో భగవద్గీత నేర్చుకోవడం ద్వారా శాంతి పట్టుదల జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు.

మట్టి గణపతీ.. మనసా స్మరామి

- పర్యావరణ హితం...మట్టి విగ్రహం
- జలవనరులను కాపాడుకుందాం



మట్టితో తయారు చేసిన వినాయకుని విగ్రహాలు

మదనపల్లె సిటీ : గణపమయ్యతత్వం పృథ్వీమయమని, అందుకే పృథ్వీలో దొరికే మట్టితో చేసే గణపయ్యనే పూజించాలని వేద పండితులు ఘోషిస్తున్నారు. ప్రతిసారి వినాయచవితి ముందు నెల రోజుల నుంచి ఈ మట్టి ప్రచారం ఊపందుకుంది. మట్టి విగ్రహాలనే పూజించాలంటూ పర్యావరణ వేత్తలు చైతన్యం కల్పిస్తున్నారు. అయినా చవితి రోజు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు మండపాల్లో ప్రత్యక్షమవుతుంటాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పూర్తిగా కనుమరుగయ్యే వరకు మట్టి గణప్యను పూజించేలా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కథనం.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దు


వినాయకచవితి రోజున మట్టి వినాయకుడిని మాత్రమే వినియోగించాలి. పూర్వకాలం నుంచి కూడా మట్టి గణపతినే పూజించేవారు. అయితే కాలాగుణంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వాడుకలోకి వచ్చాయి. ఇవి పూజకు నిషిద్ధమని ఇటు పండితులు, అటు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. స్వచ్ఛమైన మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమనే పూజకు ఉపయోగించాలని స్పష్టం చేస్తున్నారు. మట్టి వినాయకుడినే ఎందుకు పూజించాలంటే వినాయకుడి తత్వం పృథ్వీమయం అని పురాణాల్లో ఉంది.పృథ్వీ అంటే భూమి, భూమిలో లభించే మట్టితోనే ఆయన ప్రతిమను తయారు చేసి పూచించాలని పండితులు పేర్కొంటున్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహం ఎక్కువ కాలం ఉండదు కాబటి నిమజ్జనం చేయాలని చెప్పారు. గతంలోనూ మట్టి ప్రతిమతోనే గణనాథులు పూజలందుకున్నారు. అందుకే మనం మట్టి వినాయకుడిని పెట్టి పూజించాలి.

మట్టితో లాభాలు

సహజసిద్ధంగా దొరికే బంకమట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం మంచిది. ఇది నీటిలో సులభంగా కరిగిపోతుంది. మట్టి విగ్రహాల నిమజ్జనంతో జల వనరులకు ఎలాంటి నష్టం ఉండదు. సహజసిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసే రంగులను మట్టి బొమ్మలకు అద్ది ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు.

రసాయనాలతో అనర్థాలు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేసినా కరగవు. ఈ విగ్రహాల్లో జిప్సమ్, గంధకం, మెగ్రీషియమ పాదరసం, సీసం,కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ అవశేషాలుంటాయి. ఈ ప్రతిమలను పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది. రసాయనాలు కలిపిన నీటి మూలంగా శరీరంలో నరాలపై ప్రభావం చూపి కేన్సర్ వ్యాధికి దారి తీస్తుంది. చర్మ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. రసాయనిక రంగులు కలిపిన నీరు పంటపొలాల్లో చేరి దిగుబడులు తగ్గించడమే కాకుండా ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది. ప్లాస్టర్ పారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్లు పడుతుంది. నీరు, నేల,గాలి అన్నింటిపైనా కాలుష్య ప్రభావం ఉంటుంది.



ఉచితంగా మట్టి వినాయకుని విగ్రహాలు పంపిణీ

పర్యావరణ పరిరక్షణ కోసం మదనపల్లెలో పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా వినాయకుని విగ్రహాలు పంపిణీ చేస్తున్నారు. హెల్పింగ్‌మైండ్స్,సేదా సంస్థ, ఏపీఎస్‌యుఎఫ్, యోగాసెంటర్ ద్వారా ఉచితంగా పండుగ ముందు రోజు మట్టితో తయారు చేసిన బొమ్మలను ఉచితంగా అందజేస్తున్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



రసాయనాలతో తయారు చేసే ప్రతిమలను కాకుండా మట్టి వినాయకుడిని పూజించాలి. అనాధిగా మట్టి విగ్రహాలనే పూజిస్తున్నాం. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వాడుకోవడం మంచింది.

– శివకుమార్‌శర్మ, వేదపండితులు, మదనపల్లె

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే వినాయక విగ్రహాలు హానికరమైన రసాయనాలు కలిగి ఉండటం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుంది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మట్టి గణపయ్య విగ్రహాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– అబూబకర్ సిద్దిక్, హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు, మదనపల్లె

వైభవంగా నవగ్రహ ప్రతిష్ట

వాల్మీకిపురం : స్థానిక కోనేటివీధిలోని శ్రీ లక్ష్మీకామేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నవగ్రహ మూల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనము, నవ గ్రహ మూలమంత్ర ప్రతిష్ట కలాన్యాస హోమము, రుద్ర హోమము నిర్వహించారు. అనంతరం నవ గ్రహ మూల విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోనవరపు శీనా స్వామి, అర్చకులు శివకుమార్ శర్మ, చౌడేశ్వర శర్మ, సుధీర్ కుమార్ శర్మ, ఎఎస్ఎన్ కుమార్, ఆలయ ధర్మకర్త కరమల శంకరాచారి, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి దాత విరాళం అందజేశారు. పుల్లంపేటకు చెందిన శివనరసింహారెడ్డి, సుమతమ్మ దంపతులు రూ.25,116 విరాళంగా ఇచ్చారు. శనివారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయ అధికారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలకు అమ్మవారి తీర్థప్రసాదాలను, అమ్మవారి శేషవస్త్రాలను అందజేశారు.

ఖాదర్‌వల్లి మృతి సాహితీ ప్రియులకు తీరని లోటు

మదనపల్లె సిటీ : ప్రముఖ కవి, రచయిత పఠాన్ ఖాదర్‌వల్లి మృతి సాహితీ ప్రియులకు తీరని లోటని ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణ మూర్తి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌వీఆర్ లేఅవుట్‌లోని కవితా కుటీరంలో కవి పఠాన్ ఖాదర్‌వల్లి నాల్గవ వర్థంతి పురస్కరించుకుని సంస్మరణ సభ ఏర్పాటు చేశారు.

వచ్చేనెల 1వ తేదీ నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్



బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కార్యశాలలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి తలపెట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని శ్రీకృష్ణ కల్యాణమండపంలో బీజేపీ సభ్యత్వనమోదు కార్యక్రమం-2024కు సంబంధించి జిల్లా కార్యశాల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉన్న బీజేపీ సభ్యత్వ నమోదును ఈసారి మరింత రెట్టింపు ఉత్సాహంతో కార్యకర్తలందరూ పాల్గొని పెద్దసంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలని కోరారు. సమావేశంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ ఎలా చేయాలో వివరించారు. మిస్డ్‌కాల్, క్యూ ఆర్ కోడ్ స్కాన్ ద్వారా సభ్యత్వనమోదులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, నంద్యాల పార్లమెంటరీ ఇన్‌చార్జ్ పోతుగుంట రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పంటసురేష్, చంద్రమౌళి, యల్లంపల్లె ప్రశాంత్, ఆకులకృష్ణమూర్తి, కృష్ణయాదవ్, అశోక్‌గజపతిరాజు, ఓసూరికిరణ్‌కుమార్, షబ్బీర్‌అహ్మద్, బర్నేపల్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్



లోక్‌అదాలత్ ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తులు

మదనపల్లె : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మదనపల్లె మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎస్.రమేష్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం కోర్టు భవనాల సముదాయంలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంపై న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, భార్యాభర్తల కేసులు, వరకట్న నిషేధ కేసులు లాంటివి గుర్తించి రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ కేసులు రాజీ జరిగేలా కక్షిదారులకు తెలియజేయాలన్నారు. రాజీ పడిన కేసులకు సంబంధించిన అవార్డు కాపీలను ఇరువర్గాల సంతకాలతో పొందవచ్చన్నారు. ఈ కేసులకు ఎలాంటి అప్పీలు ఉండదన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పే అంతిమ తీర్పు అన్న విషయాన్ని కక్షిదారులకు తెలియజేయాలని న్యాయవాదులకు సూచించారు. కక్ష్యలు, కార్పణ్యాలకు పోయి జీవితాన్ని, సమయాన్ని వృథా చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు సహకరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి

కేవీపల్లె : జిల్లా పరిషత్ నిధులతో కేవీపల్లె మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి విన్నవించారు. శనివారం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కలసి కలెక్టర్‌కు వినతిపత్ర అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ నుంచి వచ్చిన సూచన మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్లు, బోరు, పంపుసెట్ పనులు చేపట్టడానికి రూ. 30 లక్షలతో ఎస్టిమేట్లు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఎస్టిమేట్ల ఫైళ్లపై సంబంధిత ఏఈలు కూడా సంతకం పెట్టారని, ఎంపీడీవో యాదవేంద్ర మాత్రం సంతకం పెట్టకుండా కాలయాపన చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎంపీడీవోకు తగు ఆదేశాలు జారీ చేసి అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మండల కోఆప్టెడ్ సభ్యుడు సైపుల్లాఖాన్, నాయకులు సి.కె. యర్రమరెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీర్లమాన్యం భూములు సర్వే



పీర్లమాన్యం భూములను సర్వే చేస్తున్న అధికారులు

పీలేరు : మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న పీర్ల మాన్యం భూములను శనివారం జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వసీం అక్రమ్ మాట్లాడుతూ దొడ్డిపల్లె పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 2022లో 14.84 ఎకరాలు, సర్వే నెంబరు 106లో 2.46 ఎకరాల పీర్ల మాన్యం ఉందని తెలిపారు. దురాక్రమణల బారి నుంచి పీర్ల మాన్యం భూములను కాపాడేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆ భూములను సమగ్రంగా సర్వే చేయించి స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా సరిహద్దులు ఏర్పాటు చేసి పరిరక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు హరి, అన్నపూర్ణ, వీఆర్‌వో రవి, పీర్లమాన్యం ముతవల్లి మోదీన్ బాషా (బుజ్జి), వంశపారంపర్య ముజావర్లు పాల్గొన్నారు.

బసినికొండ వెంకన్నకు శ్రావణ శోభ

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం
- కొండ ఎక్కి మొక్కులు తీర్చుకున్న భక్తులు



స్వామిని దర్శించుకునేందుకు క్యూలో వేచియున్న భక్తులు



గెవితిమ్మరాయస్వామి ఆలయం వద్ద అన్నదానం

మదనపల్లె : మదనపల్లె ఐకాన్‌గా పిలువబడే బసినికొండ వెంకటేశ్వరస్వామి ఆలయం శ్రావణ శోభను సంతరించుకుంది. మూడో శనివారం సందర్భంగా ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో చేరుకుని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు శ్రావణ శనివారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి స్వామివారిని విశేషాలంకరణతో తీర్చిదిద్దారు. దాదాపు 1,000 అడుగుల ఎత్తైన కొండ కావడం, ఆలయానికి చేరుకునేందుకు కాలినడక తప్ప వేరే మార్గం లేకపోవడంతో భక్తులు ప్రయాసపడుతూ కొండపైకి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ...కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామిని కొలిస్తే కోరిన వరాలిస్తాడన్నది భక్తుల విశ్వాసం. ఆయనకు ప్రీతికరమైన రోజు శనివారం అని, స్వామివారిని ఈ రోజు దర్శించుకోవడం వల్ల సకల శుభాలు కలుగుతాయని అన్నారు. బసినికొండ ఆలయంకు ప్రాశస్తమైన చరిత్ర కలదన్నారు. శ్రావణమాసంలో స్వామివారిని దర్శించుకునేందుకు మదనపల్లె పరిసర ప్రాంత ప్రజలే కాకుండా కర్నాటక, తమిళనాడు నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తారన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు

రామసముద్రం : రామసముద్రం మండలం దిన్నెపల్లె సమీపంలోని గెవి తిమ్మరాయమోరు వద్ద శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ డాక్టర్.శోభారాజ్ కుటుంబీకులు, వల్లాల వాలిరాజు వంశీయులు వీర మంగమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వీర మంగమ్మ వంశీయులు సీఐ వి.శ్రీధర్, వేణుగోపాల్‌రాజు, విశ్వనాథరాజులు మాట్లాడుతూ... ప్రతి శ్రావణ మాసం మూడు, నాలుగో శనివారం అమ్మవారి ఆలయానికి ఇరువురు వంశీయులు, ఆడబిడ్డలు ఉదయం వచ్చి నైవేద్యాలు సమర్పించి అమ్మవారికి నూతనవస్త్రాలు, వడిబాలు కట్టి ప్రసాదాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు శంకర్‌రాజు, చంద్రశేఖర్‌రాజు, ఆవని విజయ్‌కుమార్‌రాజు, రెడ్డిశేఖర్‌రాజు, పుష్పలత, వల్లాలజ్యోతి, లావణ్య, జ్యోతిరాజు, లావణ్య, రమ్య, నారాయణరాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

అన్ని మతాల సారం ఒకటేనని చాటిచెప్పిన అక్కాచెల్లెళ్లు



రాధాకృష్ణుల వేషంలో ముస్లిం చిన్నారులు మధిహా, మిస్బా

మదనపల్లె : పండుగల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రతి ఏటా చిన్నారులకు కృష్ణుడు, గోపికల వేషధారణ వేసి తల్లిదండ్రులు మురిసిపోతారు. శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని పాఠశాలల్లో నిర్వహిస్తున్న ముందస్తు వేడుకల్లో చిన్నారులు.. చిలిపి కృష్ణుడు, రాధ, గోపికలు, గోపాల బాలుర వేషాల్లో అలరిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన మెప్మా ఆర్పీ జాఫరున్నీసా తన ఇద్దరు పిల్లలైన మధిహా, మిస్బాలను రాధాకృష్ణుల వేషధారణలో ముస్తాబు చేసింది. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అంటూ, ఒకరి విశ్వాసాలను మరొకరు పాటిస్తూ పండుగలు జరుపుకోవడం, పరమత సహనం కలిగి ఉండాలని చెప్పింది. అన్ని మతాల సారం ఒకటేనని బిడ్డలిద్దరినీ రాధాకృష్ణుల రూపంలో చూసుకుని మురిసిపోయింది. ఈ సందర్భంగా అక్కాచెల్లెలు అయిన మధిహా, మిస్బాలు రాధాకృష్ణుల వేషంలో పిల్లనగ్రోవి చేతపట్టి, చిరునవ్వులు చిందిస్తూ సందడి చేశారు.

అపూర్వ కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం : స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1988-89 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాలలోనే కలుసుకుని ఎంతో ఉత్సాహంతో గడిపారు. అప్పట్లో చేసిన అల్లరి పనులను మననం చేసుకున్నారు. 25 ఏళ్ల తరువాత కలుసుకున్న వీరంతా ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గత పబ్లిక్ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులకు కొంత నగదును అందజేయడంతో పాటు మరి కొంత మంది పిల్లలకు పలు రకాల వస్తువులను ఉచితంగా అందజేశారు.